# కొత్త దీపం

## ఉషశ్రీ

క్రమచీకటి పడుతోంది. ఆకాశం నిండా నక్షత్రాలు తొంగి తొంగి చూస్తున్నాయి.

వీధులనిండా పిల్లలు సిసింద్రీలు వెలిగిస్తూ, టపాకాయలు పేలుస్తూంటే, కొంచెం వయసులో ఉన్నవారు మచ్చుగా తారాజువ్వలు వదులుతున్నారు. ఊరిచివర పెదకాపుగారి బాబామీంచి లేచే జువ్వలు నాలుగెదు తాడిచెట్ల యెత్తు వరకూ లేచి అక్కడ పేలి పువ్వులు జిమ్ముతున్నాయి.

మల్లిపువ్వుల్లా, వెన్నముద్దల్లా క్రిందికి రాలే ఆ పూలను చూస్తూ —

"అమ్మా, నాన్న ఈవేళ వస్తాడన్నావు కాదంటే: అప్పుడే రాజమ్మత్త గారి పిల్లలూ, వెంకన్న బావగారి వాళ్ళూ మతాబాలూ, కాకరపువ్వొత్తులూ, అగ్గిపెట్టెలూ, టపాకాయలూ అన్నీ తెచ్చేసుకున్నారే"

అని సీతా రాజ్యం అంటుండగానే, దాని తమ్ముడు రంగనాథం అందుకున్నాడు.

'వాళ్ళ మావయ్య వాళ్ళకి చిచ్చుబుడ్లూ, చక్రకాయలూకూడా పంపాట్ట. అమ్మా మా మావయ్యకూడా పంపడుటే" అన్నాడు.

దొడ్లో తులసికోట వార పిల్లలిద్దరికీ అన్నాలు పెడుతున్న వెంకట రాజ్యలక్ష్మి కన్నుల నీళ్ళు తిరిగాయి, రెండు క్షణాలు ఆమె గొంతు ఉండచుట్టుకు పోయింది.

పిల్లలిద్దరూ అన్నంతినే హడావుడిలో తల్లివైపు చూడలేదు.

అంతలో మళ్ళీ ఆకాశంలో హవాయి చువ్వ పేలి పువ్వులు రాలుతూంటే, రంగడు అటే చూస్తూ—

"అమ్మా, నాకు అలాంటి బాణసంచా కావాలే. అందమగవాళ్ళు కాలుస్తారుట".

"అంతంత పెద్దవి నువ్వు కాల్చలేవురా తమ్ముడూ, నువ్వుకూడా రామారావు బావంత పెద్దాడివయితే అప్పుడూ...."

అంటూ తలతిప్పి కంచంలోకి చూసింది.

పైట చెంగుతో కన్నులు వొత్తుకుంటూ, కంచంలో చారు పోస్తోంది, వెంకట రాజ్యలక్ష్మి.

"అమ్మా, చారూ అన్నం తినేశాంగా, మజ్జిగ" అంది సీతారాజ్యం.

"మరిచి పోయానమ్మా", అంటూ, మజ్జిగ గిన్నె అందుకుంటూండగా, ఆమె కన్నుల నీరు ఆగలేదు.

"అమ్మా, నాన్నకోసం బెంగెట్టుకున్నావా?" అని అడిగింది, సీతారాజ్యం.

రాజ్యలక్ష్మి ఏమీ మాట్లాడకుండా,

కన్నులు వొత్తుకుని, పిల్ల ముఖంలోకి చూస్తూ ఆమె బుగ్గలు పుణికింది.

సీతా రాజ్యానికి ఏమీ అర్థం కాలేదు. తల్లి ఎందుకు ఏడుస్తోందో తెలీలేదు. ఏడుస్తున్నట్టుకూడా తెలీసు రంగడికి.... అమాయికంగా బెదురుగా తల్లివైపు చూస్తూనే నెమ్మదిగా అన్నం తింటోంది సీత. ఆకాశంలో జువ్వలు చూస్తూ ముద్దనములు తున్నాడు, రంగడు.

* * *

జీవితంలో ముప్ఫైరెండు దీపావళులు గడిచి పోయాయి, వెంకట రాజ్యలక్ష్మికి.

జ్ఞానం వచ్చేవరకూ వెంకట రాజ్యలక్ష్మికూడా యేవో తెలియని అల్లరులు చేస్తూనే దీపావళిని గడిపి ఉంటుంది.

కొంచెం తెలివి వచ్చినప్పట్నుంచీ దీపావళి దీపావళికీ యిల్లంతా బాణసంచా తయారీతో నిండిపోయేది.

మతాబులూ, చిచ్చుబుడ్లూ, టపాకాయలూ, చక్రకాయలూ, సిసింద్రీలూ అన్నీ ఇంట్లోనే తయారుచేసేవారు' రాజ్యలక్ష్మి తండ్రి జనార్ధనరావుగారు' ఆయన తనకోసం, అల్లుళ్ళిద్దరికోసం' కొడుకుకోసం ప్రత్యేకం తారాజువ్వలూ, వెలక్కాయలూ, పిచికలూ కట్టేవారు.

ఇదంతా సుమారు పదిహేను, ఇరవై రోజుల తంతు. ప్రపంచ యుద్ధం జరిగే రోజుల్లో గంధకం, పటాసు దొరకడం కష్టం అయితే, దానికోసం పనిగట్టుకొని, పాలెంలో పెద్దిరెడ్డిదగ్గర ఉందని తెలిసి. రాత్రికి రాత్రి పాలేరు సుబ్బన్నని వెంటబెట్టుకొని వెళ్ళి పదిహేను రూపాయలు- ఆ రోజుల్లో-అదనంగా ఇచ్చి తెచ్చారు. అది తెచ్చేవరకూ ఆయన మనసుమనసులోలేదు. ఆరెండు, మూడురోజులూ ఆయనకు హిట్లర్ మీద చాలా కోపం వచ్చింది. అంతవరకూ ఆయన హిట్లర్ని పొగుడుతూనే ఉండేవారు. కాని దీపావళి బాణసంచాకి అవసరమైన గంధకం, పటాసు దొరకని స్థితి ఆ యుద్ధంవల్ల వచ్చిందనేసరికి ఆ యుద్ధాన్ని ప్రకటించిన హిట్లర్ మీద కోపం వచ్చింది. అంతే!

సరే, ఆ పదిహేను రోజులూ ముగ్గురు పాలికాపులు యింటిదగ్గరుండి సూరేకారం, గంధకం నూరవలసిందే. కాటుకలా నలిగితే తప్ప ఆయన కారం, గంధకం కల్వంలోంచి తీసేవారుకాదు. అప్పుడింక పాళ్లువేసి, మచ్చులుకట్టి, అవిపిల్లలచేత కాల్పించి, ఆ తరువాయి మిగతా దట్టింపులు చేయించేవారు.

ఆ రోజుల్లో మతాబుల్లో మందు కూరడానికి సరదాపడేది రాజ్యలక్ష్మి. మరీ సుకుమారులయిన పిల్లలు గట్టిగా దట్టించలేరనీ, దట్టన సరిగా లేకపోతే మతాబానిలిచి కాలదనీ జనార్దనరావు గారు పిల్లల్ని అటు రానిచ్చేవారుకాదు.

అంతేకాకుండా, పిల్లలు అశ్రద్ధగా ఆ మందు దగ్గర అగ్గిపుల్లగీసినా, అక్కడికి నిప్పు తెచ్చినా మందంతా అంటుకుని ప్రాణాపాయం తెస్తుందనీ ఆయన చాలా జాగ్రత్తపడి. పిల్లల్ని ఆ దొడ్డి వసారావేపు రానిచ్చేవారు కాదు. అయినా, తండ్రి భోజనంచేసే

సమయంలోనో, వీధిలో కూర్చుని మీసాల రాజుగారితో మాటాడుతూన్నప్పుడో సందుచూసుకుని రాజ్యలక్ష్మి మందు కూరడానికి వచ్చేది.

జనార్ధనరావుగారు పిల్లల్ని ఎంత గారంగా పెంచేవారో, అంత శిక్షణలోనూ అదుపులో ఉంచేవారు. తన పిల్లలు యింట్లో యెంత అల్లరిచేసినా, భరించేవారు కాని, వీధిలో ఎవరితోనైనా కజ్జా పెట్టుకున్నా, ఎవరైనా తన పిల్లలమీద ఫిర్యాదుచేసినా ఆయన క్రోధరుద్రులయేవారు. ఆ సమయంలో ఆయన దండనచూస్తే, ఆ చేతుల్లో పిల్లలు చచ్చిపోతారనిపించేది. అయితే పిల్లల్ని అలా కొట్టిన సన్నివేశాలు చాలా తక్కువ.

తక్కువే అయినా వాళ్ళని దండించిన మరుక్షణం ఆయన దక్షిణంవైపు పడక గదిలోకిపోయి పడుకుని ఆపూట తిండి తినకుండా బాధ పడేవారు.

"వాళ్ళని పట్టుకు కొట్టడం దేనికీ? మళ్ళీ యిలా బాధపడటం దేనికీ?" అనేది, అమాయకత్వం మూర్తీభవించిన ఆయన భార్య.

"వెర్రిదానా, వాళ్ళని ఈనాడుదారిలో పెట్టకపోతే రేపు వాళ్లు పెద్దవాళ్ళయాక సన్నాసుల్లా తయారైతే లోకం మనల్ని తిడుతుందే. ఏ తల్లికన్నదో.. అని, ఏ పాపం ఎరుగని నిన్ను దూషిస్తారే...." అని జాలిగా నవ్వేవారు.

అటువంటి తల్లిదండ్రుల రక్షణలో పెరిగిన రాజ్యలక్ష్మి, కాపురానికి వచ్చిన నాలుగైదు దీపావళులవరకూ భర్తతోపోరి బాణాసంచా యింట్లోనే తయారు చేయించేది. భర్త నరసింహారావుకూడా అంత సంతోషంతోనూ మతాబులూ, చిచ్చుబుడ్లూ వగైరాలు కట్టించడంలో కట్టడంలో కుతూహలం చూపేవాడు. అందుకోసం యిద్దరు పనివాళ్ళనికూడా పెట్టేవాడు. నాలుగు రోజులపాటు ఆ కట్టుబడి సాగవలసిందే....

అక్కడికీ రాజ్యలక్ష్మి అనేది మనిద్దరికోసం యింత సామాను దేనికని....

"ఇప్పుడంటే మనిద్దరం.... ఇంకో నాలుగేళ్లుపోతే మరోయిద్దరురారూ.... మరి అప్పుడు యిన్ని కావాలి.... యిప్పటినుంచీ అలవాటు చేసుకుంటే అప్పుడు యిబ్బంది ఉండదు...." అనేవాడు.

నరక చతుర్దశినాడు రాత్రి పన్నెండయేదాకా మతాబులుకూరి, చిచ్చుబుడ్డి దట్టించి, అప్పుడు ఆఖరున తయారు చేసిన మతాబుకాల్చి, అది పూర్తి అవుతుండగా చిచ్చుబుడ్డి వెలిగించి, ఆకాంతిలో మెరిసే రాజ్యలక్ష్మి కన్నులు ముద్దాడేవాడు. అంతవరకూ రాజ్యలక్ష్మికూడా యేదో పిండివంటచేస్తూనే ఉండేది. అంతా అయాక అప్పుడు ఆ వేడివేడి తీపి ఒకరినోటి కొకరు అందించుకుంటూ పందిరి మంచం మీదికి చేరేవారు....

ఈ తలపులు పలక మారడంతో రాజ్యలక్ష్మి గుండె గుబగుబ లాడింది.

ఆ గుబగుబ క్షణంకంటె నిలబడలేదు. అంతలోనే గులాబిలా విరిసిన

ఆమె గుండెలో ఆ గులాబుల ముళ్లే గురగురలాడి గీసుకున్నాయి. బరువెక్కిన గుండెతో తలుపులన్నీ వేసి, వీధివాకిలి తెరిచింది.

మూడు దీపావళులు....


ఇలా నరకచతుర్దశి రాత్రి....

పిల్లలకి భోజనాలు పెట్టి. ఏవో కబుర్లు చెప్పి. బెలిపిస్తూ. నిద్రపోగొట్టి వీధి గుమ్మంలోనే కూర్చునేది.

అర్ధరాత్రయినా ఆయన వస్తారని. ఎదురు చూస్తూ. ఏమాత్రం అలికిడైనా ఆయనే వస్తున్నారని ఆశగా చూడడం....

నిరాశగా తలదించుకోవడం....

ఊరంతా మాటుమణిగి, వీధి చివర కుక్కలు మొరుగుతున్నా. చెరువుగట్టు





మీద రావిచెట్టు కొమ్మల్లో గుడ్లగూబ అరుపులకి చిలకలూ, గోరింకలూ అదిరిపడికిచకిచలాడుతున్నా.... అవేవీ వినిపించేవికావు. ఇంట్లో మిణుకు మిణుకుమంటూ అద్దాల లాంతరులో వెలుగుతున్న దీపంలానే ఆ కన్నులలో ఆశ వెలుగుతూ ఉంటే....

ఆయనకోసం నిరీక్షిస్తూనే, రాత్రి రెండూ మూడు అవుతుండగా యింక కనురెప్పలను ఆపలేక, వీధి తలుపు కూడా మూసివెళ్ళి పడుకునేది.

కళ్లు మూసుకున్నా నిద్ర పట్టేదే కాదు. అది కలత నిద్రే!

ఆ నిద్రలోనే రెండు మూడుసార్లు లేచి తలుపుతీసి చూసేది.

శూన్యం ...

నిట్టూర్చడానికి కూడా శక్తిచాలక వచ్చి పడుకునేది.

* * *

ఎదురుగా మంచంమీద పిల్లలిద్దరూ ఒకరిమీద వొకరు చేతులుంచుకుని, హాయిగా నిద్రపోతున్నారు.

* * *

ఇరవై సంవత్సరాలుగా ఆ యింటి గోడకు అలంకరించి ఉన్న గడియారం విశ్వాసం మూర్తీభవించిన సేవకుడిలా నిర్విరామంగా పనిచేస్తోంది.

పనిచేసే గడియారం పది గంటలు కొట్టి, టిక్‌టిక్‌మంటూ ముందుకు సాగుతోంది.

ఒక్కసారి ముంగురులు వెనక్కు నెట్టి, కన్నులు నులుముకుని, వెనుదిరిగి గడియారం వంకచూసి, మళ్ళీ సందు చివరకు దృష్టి మళ్ళించింది.

ఆమె చూపులు ఆనినంత దూరాన్ని చూస్తున్నాయి. ఆమె మనస్సు మూడేళ్ళు వెనక్కు నడిచింది.

ఆరోజు-

ఇలానే నిరీక్షిస్తుండగా-

వీధి గుమ్మంలో మదీనా సాయెబు జట్కా ఆగింది. ఆగుతూండగానే నర్సింహారావు బండిలోంచి దిగి, కొంచెం తూలుతూ గబగబా మెట్లెక్కి యింట్లో అడుగుపెట్టి, పెడుతూనే ఒక్కసారి రాజ్యలక్ష్మిని దగ్గరగా తీసుకుని, పెదవులతో ఆమె పెదవులు అందుకున్నాడు.

పొంగి, పులకించిపోయింది-రాజ్యలక్ష్మి గుండె.

కాని-అంతలోనే వీధి తలుపు తీసి ఉన్నట్టూ జట్కా-బండిలో సామాను తీసుకుని మదీనా సాయెబు వస్తున్నట్టూ అనిపించగానే చటుక్కుని అతని కౌగిలి వదిలించుకుని, పక్కగా నిలబడింది.

గడప దాటబోయినమదీనాసాయెబు అడుగు వెనక్కు తీసుకున్నాడు.

రాజ్యలక్ష్మి. సిగ్గుపడి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

కాళ్ళు కడుక్కుందికి నీళ్ళచెంబు తెచ్చే సమయానికి, నర్సింహారావు సామానంతా లోపల పెట్టించి, ప్రయాణపు గుడ్డలు వదిలి, లోపలి చిన్ని లాగుతో ఉన్నాడు.

"అంత సిగ్గుపడ్డావెందుకే .... మదీనాసాయెబు యిప్పుడింటికెళ్లి వాడి పెళ్ళాన్నికూడా ...." అంటూనే. ఆమెను గుండెలకు హత్తుకున్నాడు.

చేతులో చెంబుతొణికి అతని కాళ్ళమీద నీళ్ళు పడ్డాయి.

"చూశావా, పతిభక్తి ఉంది కనక నీ చేతిలో నీళ్ళు నా కాళ్ళమీద పడ్డాయి."

అని మరింత దగ్గరగా హత్తుకున్నాడు.

"అప్పటి కప్పుడు పిల్లల్ని లేపి, వాళ్ళకి తను తెచ్చిన కాజాలు, లడ్డూలు తినిపిస్తూ కొంత బాణసంచా కాల్పించాలని కోరిక కలిగింది.

కాని రాజ్యలక్ష్మి చంటిపిల్లని బెలిపించినట్లు నెమ్మదినెమ్మదిగా ఆమాటా ఈమాటా చెపుతూ అతను తెచ్చిన సామానంతా లోపలగదిలో పెట్టి, ఆ రాత్రికి హాయిగా జోలపాడింది.

తెలతెలవారుతూండగానే లేచాడు, నరసింహారావు.

అప్పటికే రాజ్యలక్ష్మి, దొడ్లో నూతివారపొయ్యి అంటించి, దేగిసా నిండా నీళ్ళు పెట్టి, కొబ్బరాకులు మంట పెడుతోంది.

లుంగీ, సవరించుకుంటూ వచ్చి, ఆమె దగ్గరగా కూర్చుని;

"రాజ్యం, నిన్ను నేను చాలా హింసిస్తున్నానే'' అని, కంటతడి పెట్టాడు.

"ఇప్పుడా మాటలెందుకండి'' అని గుండెలో కదిలే దుఃఖాన్ని దిగమింగుతూ, అక్కడినుంచి వెళ్ళి, అతనికి ముఖం కడుక్కుందికి ఏర్పాట్లు చేసింది.

కాని నర్సింహారావు కదల్లేదు.

అతని గుండె దుఃఖభరమైంది.

"ఇలా దగ్గరగా కూర్చో .... నన్ను పెళ్ళాడి నువ్వనుభవించిన సుఖం ఏఁవిటో తెలీటంలేదు. నీకూ, నాకు జ్ఞానంలేనిరోజుల్లో ఏంఅనుభవించామో, అంతేకదా!"

అంటుండగా అతనికి దుఃఖం ఆగలేదు.

"పండగపూటా-ఎందుకది....రండి ....మొహం కడుక్కోండి. పిల్లలు లేచేసరికి మనిద్దరికీ తలంట్లు అయిపోతే.." అంటూ అతని కంటబడకుండా కళ్ళు నీళ్లొత్తుకుంది.

నేనురాక్షసుణ్ణి రాజ్యం....లంకంత కొంపలో ఈ పిల్లెధవలిద్దర్నీ పెట్టి కాని నువ్వు ఎలా ఉండగలుగుతున్నావని కూడా ఆలోచించలేని మూర్ఖుణ్ణి.

అని అతనింకా అనబోతుండగానే-

'రండి. మొహం కడుక్కోండి. తలంటిపోస్తాను' అని దూరంగా జరిగింది.

నరసింహారావు ముఖం కడుక్కుంటూండగా అతని మనస్సు ఎన్నెన్నో కథలను తడిమింది.

అంతకు ముందు సంవత్సరం దీపావళికికూడా యింత ఉత్సాహంతోనూ బట్టలూ, బాణసంచా తెచ్చాడు. ఉదయమే రాజ్యలక్ష్మితో సహాలేచి అన్ని పనుల్లోనూ ఆమెకు చేదోడు వాదోడుగా ఉన్నాడు.

పిల్లలకి ఆమె తలంటుతుంటే అతను పులుసుపోశాడు. ఆమె తల తుడిచివేస్తే, అతను తలచిక్కు తీసి కొత్తబట్టలు తొడిగాడు. వంటలో

కూడా కూర తరిగి యిచ్చి, పోపు సామాను అందించి, ఏవో ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్తూ పిల్లలకి తను తెచ్చిన లడ్డూలు పెడుతూ బాణసంచా అంతా ఎండలో పెట్టించాడు. భోజనాలకు కూర్చోబోయేముందు రాజ్యలక్ష్మి చేత కొత్తచీర కట్టించాడు.

హుషారుగా కబుర్లు చెప్తూ ఆమె చేత అన్నం కలిపించుకుని ఆమెనోట్లో ఓ ముద్ద పెడుతూ, ఓముద్ద తానుతింటూ కులాసాగా గడుపుతున్నాడు.

రాజ్యలక్ష్మి చారుపోసింది. అప్పటికే పిల్లలిద్దరూ అన్నాలు తినేసి, దొడ్లో బాణసంచా దగ్గర కూర్చొని వాటాలేసుకుంటున్నారు.

వడ్డిస్తున్న చారు పురిషెడు నోట్లో పోసుకుని—

"ఛి ఛీ .... ఉప్పు కషాయం...." అంటూ కంచంయెత్తి ఆమె నెత్తిమీద దిమ్మరించాడు.

"చారు కాచడం చేతకాని వెధవకి సంసారందేని" అంటూ లేచేశాడు.

రాజ్యలక్ష్మి తల పైకెత్తలేకపోయింది. అలానే కూర్చునిపోయింది. అటువంటి సమయాల్లో ఏం మాట్లాడినా అతని క్రోధానికి అది యింకా యింధనమే అని ఆమెకు తెలుసు. మౌనంగా భరించడమే అటువంటి ఆవేశానికి ఉచితమైన ఔషధం అని పెళ్ళైన ఏడాదిలోనే తెలుసుకుంది.

అలానే ఈసారి లోలోపలే దుఃఖాన్ని దిగమింగింది. అలా కోపిన నర్సింహారావు గదిలోకి వెళ్ళి బట్టలేసుకుని వెళ్ళిపోయినట్టు గంటదాకా రాజ్యలక్ష్మికి తెలీదు. ఆ వెళ్ళడం వెళ్ళడం మూడు నెలలదాకా తిరిగి రాలేదు. ఉత్తరం ముక్క కూడాలేదు.

* * *

ఈ సన్నివేశం మనసుకి రాగానే నర్సింహారావుకి తనమీదనే అసహ్యం కలిగింది.

మొహం కడుగుతున్నవాడు లేచి వెళ్ళి, రాజ్యలక్ష్మిని గదిలోకి తీసికెళ్ళి, పెట్టిలోంచి కవరు తీసి—

'రాజ్యం, ఈ కవరు ఏ పరిస్థితిలోనూ నా చేతికివ్వకు. బహుశా నేనెంతటి ఆస్తిపరుణ్ణో నీకు తెలీదు. కాని యిప్పుడు మనకు మిగిలింది మూడెకరాల ఆస్తీ, ఈ యిల్లూనూ. ఈ రెండూ నీ పేర రిజిష్టర్ చేయించేశాను. ఇదీ లేకపోతే రేపు నేను హైదరాబాద్‌లో తాగుడు ఎక్కువై కన్నుమూస్తే...."

అని అతను అంటుంటే, ఆ నోటికి తన చెయ్యి అడ్డంపెట్టి..

"అలా అనకండి. దేవుడు చిన్నచూపులు చూడడు. ఈ ఆస్తి నా పేర దేనికి" అంటూ మంగళ సూత్రాలు కళ్ళకద్దుకుంది.

"వెర్రిదానా. నీకంటే దానికి నా లాంటి రాక్షసుడు దొరకకూడదే ఈ కాగితాలు దాచెయ్యి' అంటూ ఆమెను గుండెలకు హత్తుకున్నాడు. పిల్లలు నవ్వుతూ మతాబా వెలిగించారు.